

• వేటు పడింది

• అయినా మారలేదు

వైసీపీ సేవలో వలంటీర్లు

ఇప్పటికే 163 మంది గుర్తింపు

తొలిదశలో 35 మంది తొలగింపు

ఉద్యోగం పోయినవారికి అధికార పార్టీ నేతల ప్రలోభాలు

ప్రచారంలో వారిని వాడుకునేందుకు ప్రయత్నాలు

చిత్తూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు తొలగింపులు.. మరోవైపు విమర్శలు.. అయినా కొందరు వలంటీర్లు వైసీపీ సేవలో తరిస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో ముమ్మరంగా పాల్గొంటున్నారు.

'వలంటీర్లుగా ప్రచారం చేయండి.. ఒకవేళ గుర్తించి తొలగిస్తే పూర్తిస్థాయిలో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనండి. దీనికి మీకు ఎంతో కొంత లబ్ధి కలిగిస్తాం. మళ్లీ వైసీపీ ప్రభుత్వం వస్తే మీరే వలంటీర్లు' అంటూ నేతలు వారిని మభ్యపెడుతున్నారు. దీంతో ఆ వలంటీర్లు అధికార పార్టీతో అంటకాగుతున్నారు.

జిల్లాలో 9195 మంది వలంటీర్లు వార్డు, గ్రామ సచివాలయాల్లో ఉన్నారు. ప్రభుత్వం వీరికి నెలకు రూ.5 వేల గౌరవ వేతనం ఇస్తోంది. ఏడాదికోసారి సేవా పతకాలతో సత్కరించి, నగదు బహుమతి అందిస్తోంది. వీరంతా ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాలి. కానీ, తొలినుంచీ వలంటీర్లను ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు పార్టీ తరఫునా వాడుకుంటున్నారు. వైసీపీకి ఉపయోగపడే పలురకాల సర్వేలు చేసి, వివరాలు సేకరించారు. ప్రజల సొమ్ము గౌరవ వేతనంగా తీసుకుని పార్టీ కార్యకర్తల్లా పనిచేయడం ఏమిటంటూ ఎన్ని విమర్శలు వచ్చినా ప్రభుత్వ పెద్దలు పట్టించుకోలేదు. ఇప్పుడు ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఈ క్రమంలో వలంటీర్లను ఎన్నికలకు సంబంధించిన విధుల్లో భాగస్వామ్యం చేయొద్దని ఎన్నికల కమిషన్ కలెక్టర్లకు గట్టిగా హెచ్చరికలు జారీ చేసింది. దీంతో అధికారులు కూడా వైసీపీ నాయకులతో కలిసి ప్రచారం చేస్తున్న వలంటీర్ల మీద వేటు వేస్తున్నారు. ప్రచారంలో ఉన్న వలంటీర్ల ఫొటోలు, వీడియోలను అధికారులకు పంపి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో వైసీపీతో అంటకాగుతున్న 163 మంది వలంటీర్లను అధికారులు గుర్తించారు. వీరిలో 35 మందిని విధుల నుంచి పూర్తిగా తొలగించారు. వీరిలో ఈ నెల 16న చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో 18 మందిని, పలమనేరు మున్సిపాలిటీలో 12 మందిని, గుడిపాల మండలంలో ముగ్గుర్ని తొలగించారు. తాజాగా మంగళవారం పులిచెర్ల మండలంలో ఇద్దర్ని తొలగిస్తూ ఉత్తర్వులిచ్చారు. వీరంతా స్థానికంగా వైసీపీ నాయకులతో ప్రచారంలో పాల్గొంటున్నారని గుర్తించి చర్యలు తీసుకున్నారు.

ఉద్యోగం పోయినా..

ఉద్యోగం కోల్పోయిన వలంటీర్లకు ఏదో ఒకలా లబ్ధి కలిగిస్తామంటూ వైసీపీ నాయకులు మభ్యపెట్టి.. ఎన్నికల ప్రచారానికి పూర్తిస్థాయిలో వాడుకుంటున్నట్లు విమర్శలున్నాయి.

ఆ వలంటీర్లకు తమ పరిధిలోని 50-100 ఇళ్ల మీద అవగాహన ఉంటుంది. ఆయా ఇళ్లకు సంబంధించిన అన్నిరకాల వివరాలు వారి వద్ద ఉంటాయి. పథకాల లబ్ధిదారులను వలంటీర్లు ప్రభావితం కూడా చేస్తున్నారు. దీంతో వైసీపీ నాయకులు వలంటీర్లను... ఉద్యోగం పోయిన వారినీ పక్కన పెట్టుకుని ప్రచారం చేస్తున్నారు. ఉద్యోగం కోల్పోయిన వాళ్లకు కోడ్ ఆంక్షలు ఉండవు కాబట్టి.. వారంతా పూర్తిస్థాయిలో కార్యకర్తల్లా ప్రచారం చేస్తున్నారు.

వైసీపీ ప్రచారంలో పాల్గొన్న ఉపాధి సిబ్బంది తొలగింపు

కుప్పం/చిత్తూరు కలెక్టరేట్, మార్చి 19: వైసీపీ నేతలతో కలసి అధికార పార్టీ తరఫున ప్రచారంలో పాల్గొన్న ఇద్దరు ఉపాధి సిబ్బందిని విధులనుంచి తొలగిస్తూ మంగళవారం కలెక్టర్ షన్మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. గుడుపల్లె మండలం చీకటిపల్లె ఫీల్డ్ అసిస్టెంట్ వైసీపీ తరఫున ప్రచారంలో పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్సీ పీఏగా డిప్యుటేషన్ మీద ఉన్న మురుగేశ్ సోమవారం ఆర్వో అఖిలపక్ష పార్టీలతో నిర్వహించిన సమావేశంలో అధికార పార్టీ తరఫున పాల్గొన్నారు. దీనిపై పత్రికల్లో వార్తలు వచ్చాయి. స్పందించిన కలెక్టర్ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన ఇద్దరినీ విధులనుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఇద్దరు వలంటీర్ల తొలగింపు

• ఉపాధి క్షేత్రసహాయకుడిపై విచారణ నివేదిక అందజేత

కల్లూరు, మార్చి 19: పులిచెర్ల మండలంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన ఇద్దరు వలంటీర్లను విధుల నుంచి తొలగించారు. ఉపాధి హామీ పథకం క్షేత్రసహాయకుడిపై విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చినట్లు ఎంపీడీవో సురేష్‌బాబు మంగళవారం తెలిపారు. ఈనెల 17వ తేదీన వైసీపీ ఆధ్వర్యంలో జరిగిన ద్విచక్ర వాహన ర్యాలీలో వెంకటదాసరపల్లి పంచాయతీకి చెందిన వలంటీర్లు చంద్రశేఖర్, గిరి, అయ్యావాండ్లపల్లె పంచాయతీకి చెందిన ఉపాధి హామీ పథకం క్షేత్రసహాయకుడు మురళి పాల్గొన్నారంటూ టీడీపీ నాయకులు మోహన్ దాస్, కిరణ్ ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టి ఇద్దరు వలంటీర్లను తొలగించారు. క్షేత్రసహాయకుడు మురళిని ఎంపీడీవో విచారించి రాతపూర్వకంగా సంజాయిషీని తీసుకున్నారు. ఈ విచారణ నివేదికను డ్వామా పీడీ రాజశేఖర్‌కు పంపామని ఎంపీడీవో తెలిపారు.



ర్యాలీలో క్షేత్రసహాయకుడు మురళి పాల్గొన్నట్లు టీడీపీ నాయకులు ఇచ్చిన ఫొటో





గోడపై పెయింట్ వేస్తున్న వలంటీరు రాజశేఖర్ - ప్రచారంలో పాల్గొన్న వలంటీరు బాలరాజు

వలంటీర్లది అదే తీరు

కుప్పం, మార్చి 19: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా, కొందరిపై వేటు పడుతున్నా కొందరు వలంటీర్ల తీరు మారడంలేదు. వైసీపీకి మద్దతుగా ప్రచారంలో పాల్గొంటున్నారు. గుడుపల్లె మండలం సోడిగానిపల్లె పంచాయతీ మల్దేపల్లెలో వలంటీరు బాలరాజు వైసీపీ కండువా కప్పుకుని ఆ పార్టీ నేతలతో కలిసి మంగళవారం ప్రచారంలో పాల్గొన్నారు. ఇదే మండలానికి చెందిన పెద్దబజనవాడలో వలంటీరు రాజశేఖర్ 'ఫ్యాను గుర్తుకే ఓటేయండి' అన్న అక్షరాలు కలిగిన అచ్చును చేతబట్టి గోడలకు పెయింట్ వేశాడు.

సురేంద్రనగరం పంచాయతీలోనూ..

కార్వేటినగరం: కార్వేటినగరం మండలం సురేంద్రనగరం పంచాయతీలో మంగళవారం ఉదయం వైసీపీ అభ్యర్థి కృపాలక్ష్మి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో వలంటీరు రఫీ పాల్గొన్నారు. ఇతడిపై రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేసినట్లు జనసేన పార్టీ మండల అధ్యక్షుడు శోభన్‌బాబు తెలిపారు.



ఎన్నికల ప్రచారంలో వలంటీరు రఫీ

వైసీపీ కార్యకర్తల్లా ఉద్యోగులు

• చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్‌కు టీడీపీ ఫిర్యాదు
• సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న వీడియోలు

పుంగనూరు, మార్చి 19: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా పుంగనూరు నియోజకవర్గంలో పలువురు ప్రభుత్వ ఉద్యోగులు, కొందరు వలంటీర్లు వైసీపీ కార్యకర్తల్లా పనిచేస్తున్నారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్‌కు, కేంద్ర ఎన్నికల సంఘానికి టీడీపీ నాయకులు ఫిర్యాదులు పంపారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిని గెలిపించాలని కరపత్రాలతో పుంగనూరు మండలం బండ్లపల్లె పంచాయతీ నెల్లూరుపల్లెకి చెందిన బోయకొండ కాంట్రాక్టు ఉద్యోగి టి.శంకరప్ప ప్రచారం చేశారని పేర్కొన్నారు. అలాగే, గోపిశెట్టిపల్లెకు చెందిన కుమ్మరనత్తం గ్రామ రెవెన్యూ అధికారి మునిరత్నంకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వైసీపీ కండువా కప్పిన ఫొటోతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కొంతకాలం కిందట గోపిశెట్టిపల్లె గ్రామస్థులు, మహిళలను వైసీపీ నాయకులు బస్సుల్లో తిరుపతిలోని మంత్రి పెద్దిరెడ్డి ఇంటికి తీసుకెళ్లి ఆ పార్టీలో చేర్పించారు. అప్పుడే వీఆర్వో మునిరత్నం కూడా వెళ్లడంతో మంత్రి ఆయనకు కండువా కప్పారు. ఈ రెండు ఫొటోలతో తెలుగుదేశం పార్టీ నాయకులు ఫిర్యాదులు చేసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. వీరిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.



కుమ్మరనత్తం వీఆర్వో మునిరత్నంకు ఇటీవల వైసీపీ కండువా కప్పుతున్న మంత్రి పెద్దిరెడ్డి



పుంగనూరులో పెద్దిరెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగి శంకరప్ప

ఎమ్మెల్యే ఫొటోలతో రైటింగ్ ప్యాడ్లపై ఈసీ సీరియస్

• కోడ్ ఉల్లంఘనపై వి.కోటలో కేసు నమోదు
• పలమనేరు ఎమ్మెల్యేకు షోకాజ్ నోటీసు



బాలుర ఉన్నత పాఠశాల వద్ద అధికారులతో తగాదా పడుతున్న వైసీపీ నేతలు

వి.కోట, మార్చి 19: పలమనేరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఫొటోలున్న రైటింగ్ ప్యాడ్లతో పదో తరగతి విద్యార్థులను పరీక్ష రాసేందుకు అనుమతించడంపై ఈసీ సీరియస్ అయింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో చర్యలకు ఉపక్రమించింది. వి.కోట పరీక్షా కేంద్రాలో సోమవారం రైటింగ్ ప్యాడ్లపై ఎమ్మెల్యే వెంకటేగౌడ ఫొటో ఉండటాన్ని గమనించి ఫ్లయింగ్ స్క్వాడ్ ఇచ్చిన నివేదిక మేరకు కోడ్ ఉల్లంఘన జరిగిందంటూ పలమనేరు నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీవో మనోజ్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే వెంకటేగౌడ ఫొటో కలిగిన ప్యాడ్లను వినియోగించడం ఎన్నికల నియమావళి ఉల్లంఘన కింద గుర్తుతెలియని వ్యక్తులపై సీఐ లింగప్ప కేసు నమోదు చేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక ప్యాడ్లను పంపిణీ చేశారా? లేదా పంపిణీ చేశాక కోడ్ అమల్లోకి వచ్చిందా? అన్న కోణంలో విచారణ జరుపుతున్నారు. పోలీసులు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల వద్దకు చేరుకుని ఈ ప్యాడ్లను ఎప్పుడు.. ఎవరు ఇచ్చారంటూ విచారణ చేపట్టారు. మరోవైపు ఎమ్మెల్యే వెంకటేగౌడకు ఈసీ షోకాజ్ నోటీసు జారీ చేసింది. 24 గంటల్లోపు దీనిపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

రైటింగ్ ప్యాడ్లను అనుమతించాలని వైసీపీ గొడవ

ఎమ్మెల్యే ఫొటోతో రైటింగ్ ప్యాడ్లను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించొద్దంటూ అధికారులు స్పష్టంచేశారు. దీంతో మంగళవారం ఉదయం రెవెన్యూ ఉద్యోగులు అన్ని పరీక్షా కేంద్రల వద్దకు చేరుకుని రైటింగ్ ప్యాడ్లను తనిఖీ చేసి లోపలకు పంపారు. వి.కోటలోని బాలుర ఉన్నత పాఠశాల కేంద్రం వద్ద ఎమ్మెల్యే ఫొటోలున్న రైటింగ్ ప్యాడ్లు అనుమతించేది లేదనడంతో కొందరు విద్యార్థులు ఫొటోను తొలగించి తీసుకెళ్లారు. అదేసమయానికి అక్కడకు చేరుకున్న కొందరు వైసీపీ నేతలు తమ ఎమ్మెల్యే ఫొటోలున్న రైటింగ్ ప్యాడ్లను ఎందుకు అనుమతించరంటూ వాగ్వాదానికి దిగారు. దీంతో గందరగోళ వాతావరణం నెలకొంది. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉన్నా.. సుమారు అరగంట పాటు కేంద్రం ముందు విద్యార్థుల రాకపోకలకు ఇబ్బంది పెట్టేలా అధికార పార్టీ నేతలు వ్యవహరించారు. అయినా, పోలీసులు వారిని సముదాయిస్తూ ఉన్నారేతప్ప పక్కకు తరలించే చర్యలు చేపట్టలేదు. పరీక్షా సమయం అవుతున్నా వైసీపీ నేతల వాగ్వాదం కొనసాగడంతో రెవెన్యూ అధికారులు వారిని బలవంతంగా పక్కకు పంపారు. కాగా, చాలా మంది గ్రామీణ విద్యార్థుల ప్యాడ్లను తీసేసుకోవడంతో.. తామెలా పరీక్షలు రాయాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు దుకాణాలకు వెళ్లి కొత్త ప్యాడ్లను తీసుకొచ్చి వారికి అందించారు. రైటింగ్ ప్యాడ్ల విషయంలో రాజకీయం చేస్తున్నారంటూ వైసీపీ సోషల్ మీడియా వేదికగా విపరీతంగా పోస్టులు వైరల్ అవుతున్నాయి. వీటిపైనా ఈసీ దృష్టి సారించాలని ప్రతిపక్షాలు కోరుతున్నాయి.



పరీక్షా కేంద్రం వద్ద ఆర్డీవో మనోజ్‌రెడ్డి తనిఖీలు

ఇది ఎన్నికల నిబంధనల ఉల్లంఘనే

పలమనేరు: విద్యార్థులకు ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే ఫొటోలతో ఉన్న ప్యాడ్లు పంపిణీ చేయడం ఎన్నికల నిబంధనల ఉల్లంఘన కిందకే వస్తుందని పలమనేరు నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీవో మనోజ్‌రెడ్డి తెలిపారు. పలమనేరులోని కొన్ని పదో తరగతి పరీక్షా కేంద్రాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. నియోజకవర్గంలోని 22 పరీక్షా కేంద్రాలను అధికారులు.. తాను పట్టణంలోని నాలుగు కేంద్రాలను తనిఖీ చేశామన్నారు. మంగళవారం కూడా ఎమ్మెల్యే ఫొటోతో ఉన్న రైటింగ్ ప్యాడ్లను కొందరు తీసుకురాగా స్వాధీనం చేసుకొని, ప్రత్యామ్నాయంగా ప్యాడ్లను అందజేశామన్నారు. తన ఫిర్యాదు మేరకు గుర్తు తెలియని వ్యక్తులపై వి.కోట పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. పోలీసుల విచారణలో ఈ ప్యాడ్లను ఎమ్మెల్యే పంపిణీ చేసినట్లు తేలితే దీనికైన ఖర్చును ప్రస్తుతం అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆయన ఎన్నికల వ్యయం కింద పరిగణించే అవకాశం లేకపోలేదన్నారు.ఈ ఘటనపై జిల్లా ఎన్నికల అధికారికి కూడా నివేదిక పంపామన్నారు.ఆయన ఆదేశాల మేరకు తదుపరి చర్యలు ఉంటాయని చెప్పారు.



సెల్ఫీలే కాదు.. ఓటూ వేస్తాం

చిత్తూరు, మార్చి 19: సెల్ఫీలు తీసుకోవడమే కాదు. బాధ్యతగా ఓటూ వేస్తామని యువత స్పష్టం చేస్తున్నారు. కొత్త యువ ఓటర్లకు ఓటు హక్కుపై అవగాహన కల్పించేలా స్వీప్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. తద్వారా ఓటుహక్కును సద్వినియోగం చేసుకునేలా యువతలో చైతన్యం తెస్తున్నారు. ఇందులో భాగంగా యువతలో బాగా క్రేజ్ ఉన్న హాలీవుడ్ యానిమేటెడ్, సూపర్ హీరో చిత్రాల్లోని పాత్రలను ఓటరు కార్డులో ఉన్న సెల్ఫీ పాయింట్లు చిత్తూరు నగరంలోని పలు డిగ్రీ కళాశాలల్లో ఏర్పాటు చేశారు. ఈ సెల్ఫీ పాయింట్లు యువ ఓటర్లు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఆ కటౌట్ల వద్ద వీరు ఉత్సాహంగా సెల్ఫీలు దిగుతున్నారు. రానున్న ఎన్నికల్లో బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకుంటామని చెబుతున్నారు.

చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడిగా సీఆర్ రాజన్



చిత్తూరు సిటీ, మార్చి 19: చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడిగా చంద్రగిరి నియోజకవర్గానికి చెందిన తిరుచానూరు మాజీ సర్పంచి సీఆర్ రాజన్ నియమితులయ్యారు. ఇప్పటి వరకూ ఆ పదవిలో వున్న పులివర్తి నానీ చంద్రగిరి నియోజకవర్గ ఇంచార్జిగానూ, టీడీపీ అభ్యర్థిగానూ ఎన్నికల్లో బిజీగా ఉండటంతో ఆయన స్థానంలో రాజన్‌ను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు నియమించారు. వన్నియకుల క్షత్రియ సంఘం రాష్ట్ర కోశాధికారిగా, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా రాజన్ పనిచేశారు. ఈ ఎన్నికల్లో చిత్తూరు అసెంబ్లీ టికెట్ ఆశించారు. అక్కడికి తన మకాం మార్చి పార్టీలో చురుగ్గా పనిచేశారు. పలు సమీకరణల కారణంగా ఆయనకు టికెట్ దక్కలేదు. దానివల్ల ఆయనకు పార్టీలో సముచిత గుర్తింపు, గౌరవం కల్పించే క్రమంలో చిత్తూరు పార్లమెంటు అధ్యక్ష పదవి కేటాయించారు. చంద్రగిరి నియోజకవర్గంలో ఈసారి ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని హోరాహోరీగా పోరాడుతున్న పులివర్తి నానీ వ్యూహాత్మకంగా రాజన్‌కు ఈ పదవి దక్కేలా అధినేత చంద్రబాబుపై ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. చిత్తూరు పార్లమెంటు ఉపాధ్యక్షులుగా ఇ.శ్రీనివాసులు (చిత్తూరు) పీసీ మణి (రామచంద్రా పురం), వాణిజ్యవిభాగం ఉపాధ్యక్షుడిగా ఎస్‌పి ప్రసాద్ రెడ్డి, ఎం.గోపి (చిత్తూరు), సాంస్కృతిక విభాగం ఉపాధ్యక్షుడిగా జి.రమేష్, టీచర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడిగా ఎస్.నరసింహులు (చిత్తూరు) నియమితులయ్యారు.

'ఓపెన్' పరీక్షలపై ఇద్దరు పరిశీలకుల రాక

చిత్తూరు (సెంట్రల్), మార్చి 19: టెన్త్ పరీక్షల నిర్వహణలో తొలి రోజున జిల్లాలో జరిగిన పరిణామాల దృష్ట్యా మంగళవారం ఇద్దరు పరిశీలకులు వచ్చారు. రాష్ట్ర విద్యాశాఖ ఓపెన్ స్కూల్‌కు విభాగానికి చెందిన అక్బర్ అలీ, శ్రీనివాసులు వచ్చారు. జిల్లాలోని పలు కేంద్రాల్లో జరుగుతున్న ఓపెన్ పరీక్షలను పరిశీలించారు. తొలి రోజున జరిగిన పరిణామాలు పునరావృతం కాకుండా కట్టుదిట్టం చేశారు. మంగళవారం జరిగిన హిందీ పరీక్షల్లో ఓపెన్ స్కూల్ టెన్త్ విద్యార్థులు 54 మందికి గాను 50 మంది హాజరుకాగా, నలుగురు గైర్హాజరయ్యారు. ఇంటర్మీడియట్‌కు సంబంధించి 2682 మంది విద్యార్థులకు గాను 2590 మంది హాజరు కాగా, 92 మంది గైర్హాజరైనట్లు డీఈవో దేవరాజు, పరీక్షల సహాయ కమిషనర్ చాముండేశ్వరి తెలిపారు.

రెండో రోజూ మూతపడని జిరాక్స్ కేంద్రాలు

టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా రెండో రోజైన మంగళవారం హిందీ పరీక్ష సమయంలోనూ నిబంధనల ప్రకారం జిరాక్స్ కేంద్రాలు మూయలేదు. గిరింపేటలోని మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల సెంటర్‌గా ఉండగా, ఇక్కడకు అత్యంత సమీపంలోని జిరాక్స్ సెంటర్.. సీబీ రోడ్డులో లిటిల్ ఫ్లవర్ స్కూల్ పరీక్షా కేంద్రం సమీపంలోని జిరాక్స్ సెంటర్లు యథావిధిగా పనిచేశాయి. ఇలా పలు కేంద్రాల వద్ద జిరాక్స్ సెంటర్లు తెరచే ఉన్నాయి. కాగా, మంగళవారం జరిగిన హిందీ పరీక్షకు 21,502 మంది విద్యార్థులకు గాను 20,868 మంది హాజరు కాగా, 634 మంది గైర్హాజరైనట్లు డీఈవో దేవరాజు తెలిపారు. కాగా 43 కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేయగా, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 35 కేంద్రాలు, డీఈవో నాలుగు కేంద్రాలను పరిశీలించారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధవారం): సా. 6.29
సహరి (గురువారం): ఉ. 4.56

లక్షితను చంపిన చిరుత గుర్తింపు

• అడవిలో వదలం.. జూలోనే ఉంచుతాం: అటవీశాఖ అధికారి



మంగళం, మార్చి 19: తన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి దర్శనం కోసం తిరుమల కాలి నడకదారిలో వెళుతున్న నెల్లూరు బాలిక లక్షితపై దాడిచేసి, క్రూరంగా చంపేసిన చిరుతను గుర్తించారు. 2023 ఆగస్టులో ఈ హృదయ విదారకమైన ఘటన జరిగింది. వెంటనే స్పందించిన టీటీడీ, అటవీశాఖ అధికారులు దాడి జరిగిన లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమీప ప్రాంతాల్లో బోన్లను ఏర్పాటు చేశారు. వరుసగా ఆరు చిరుతలు చిక్కాయి. వీటినుంచి పలు నమూనాలను, లక్షితకు సంబంధించిన నమూనాలను ల్యాబ్‌కు పంపారు. ముందుగా పట్టుబడ్డ మూడు చిరుత నమూనాల్లో లక్షితను చంపినట్లు ఆధారాలు లభించలేదు. నాల్గవ చిరుత నమూనాల్లో ఆధారాలు లభించాయి. ల్యాబ్ నుంచి ఆధారాలు నెలరోజుల్లో వస్తాయని అటవీశాఖ అధికారులు భావించినా.. దాదాపు ఏడు నెలలు సమయం పట్టింది. కాగా, ముందుగా పట్టుబడ్డ మూడు చిరుతల్లో రెండింటిని జనారణ్యానికి దూరంగా అటవీప్రాంతంలో వదలిపెట్టారు. ఓ చిరుతను విశాఖ పట్టణం జూకు తరలించారు. మిగిలినవి జూలోనే ఉన్నాయి. మంగళవారం ల్యాబ్ నుంచి వచ్చిన రిపోర్టు ఆధారంగా లక్షితను చంపిన నాల్గవ చిరుతను జూపార్కులోనే ఉంచనున్నట్లు జిల్లా అటవీశాఖ అధికారి సతీష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఎందుకంటే ఈ చిరుత.. జంతువులను వేటాడి తినే పరిస్థితిలో లేదని, కోరపళ్లు నాలుగు రాలిపోయాయన్నారు. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకునే జూపార్కులోనే ఉంచాలని నిర్ణయించినట్లు వివరించారు.

రాజుపేట వద్ద రూ.4 లక్షల స్వాధీనం

రామకుప్పం, మార్చి 19: రామకుప్పం మండలం రాజుపేట వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్, పోలీసులు సోమవారం అర్ధరాత్రి 11.30 గంటలకు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రామకుప్పం మండలం బగలనత్తంకు చెందిన ప్రభాకర్ నుంచి రూ.4లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఆ నగదుకు సంబంధించిన ఆధారాలు చూపలేదు. దీంతో ఆ మొత్తాన్ని మంగళవారం ట్రెజరీలో జమ చేసినట్లు కుప్పం నియోజకవర్గ ఎన్నికల అధికారి శ్రీనివాసులు తెలిపారు.

..అయినా రంగు మారలేదు

కార్వేటినగరం, మార్చి 19: ఎన్నికల కోడ్ వచ్చింది. నిబంధనల ప్రకారం ప్రభుత్వ కార్యాలయాలకు పార్టీ రంగులు ఉండకూడదు. కానీ, కార్వేటినగరం మండల కాంప్లెక్స్ ప్రవేశ ద్వారం వద్ద ఉన్న ఒక స్తంభానికి, లోపల వైపున ఉన్న మరో రెండు స్తంభాలకు వైసీపీ రంగులను ఇంకా తొలగించలేదు. ఈ రంగులకు ఎన్నికల కోడ్ వర్తించదా అని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా మండల కాంప్లెక్స్ ప్రవేశ ద్వారానికి ఉన్న రంగులను తొలగించాల్సి ఉంది.


వైసీపీ రంగులతో మండల కాంప్లెక్స్ సముదాయం

అలాగే.. సిమెంటు బెంచీ

చిత్తూరు సిటీ: ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో టీడీపీ రంగులు, అభ్యర్థి ఫొటోలు ఎక్కడున్నా అధికారులు తొలగిస్తున్నారు. కానీ, ఇప్పటికీ వైసీపీ రంగులు చిత్తూరు నగరంలో కనిపిస్తూనే ఉన్నాయి. ప్రధానమైన జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో బహిరంగ ప్రదేశంలో వైసీపీ రంగులతో చైర్‌పర్సన్ ఎం.రెడ్డెమ్మ పేరుతో ఉన్న సిమెంట్ బెంచీ కనిపించడం విమర్శలకు తావిస్తోంది. అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించి.. వీటినీ తొలగించాలని ప్రతిపక్షాలు కోరుతున్నాయి.



డీసీసీబీ ఆవరణలో వైసీపీ రంగులతో సిమెంట్ బెంచీ

డీఎంహెచ్‌వో కార్యాలయంలో స్పందన కార్యక్రమం

చిత్తూరు రూరల్, మార్చి 19: చిత్తూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు తమ సమస్యలను డీఎంహెచ్‌వోకు విన్నవించుకున్నారు. ఉద్యోగులు మాట్లాడుతూ తమ శాఖకే ప్రత్యేకంగా గ్రీవెన్స్ సెల్ నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. తమ సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం ఒక్క రోజే 80 వినతులు వచ్చాయని, వాటిని పరిశీలించిన త్వరితగతిన పరిష్కరిస్తామని డీఎంహెచ్‌వో తెలిపారు.


వినతులు స్వీకరిస్తున్న డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి

వీడని ఏనుగుల దాడులు

సదుం, మార్చి 19: మండల పరిధిలోని అటవీ శివారు ప్రాంత గ్రామాల పరిసర ప్రాంతాల్లో ఏనుగుల దాడులు ఆగడంలేదు. మంగళవారం తెల్లవారుజామున జోగివారిపల్లె పంచాయతీ నాయునివారిపల్లె గ్రామ సమీపంలో ఏనుగుల గుంపు సంచరించింది. రైతు సుబ్రహ్మణ్యానికి చెందిన మామిడి చెట్లను విరిచేశాయి. లోకనాథం, మల్లికార్జున, రమణారెడ్డిలకు చెందిన వరి పంటను తొక్కి పంట నష్టంచేశాయి. ఫారెస్టు సెక్షన్, బీట్ ఆఫీసర్లు సురేంద్ర, మహేశ్‌లు ట్రాకర్స్‌తో వెళ్లి ఏనుగుల గుంపును గుర్తించి నాయునివారిపల్లె అటవీ ప్రాంతంలోని నీళ్ల కుంట వైపు మళ్లించారు. ఐరాల, దామలచెరువు అటవీ ప్రాంతం నుంచి ఏనుగుల గుంపు వచ్చినట్లు వారు తెలిపారు. పెద్ద ఉప్పరపల్లె, నాయన వారిపల్లె, బత్తలవారి పల్లె వాసులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పంట నష్ట పరిహారం కోసం అధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు.


ఏనుగుల దాడిలో నేలకొరిగిన మామిడి చెట్ల వద్ద రైతు సుబ్రహ్మణ్యం

వాహనం ఢీకొని దుప్పికి గాయం

వెదురుకుప్పం, మార్చి 19: వెదురుకుప్పం మండలం ఎర్రగుంటపల్లి సమీపంలో మంగళవారం ఓ దుప్పి దారి తప్పి రహదారిపైకి వచ్చింది. ఆ దుప్పిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో గాయపడి రోడ్డుపైనే పడిపోయింది. ఆ తర్వాత కుక్కల దాడిలో గాయపడిందన్న ప్రచారం జరిగింది. స్థానికులు గమనించి.. ఆ దుప్పిని తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం బాదూరు పశువైద్యశాలకు తరలించారు.



అలిపిరి కాలినడక మార్గంలో జెర్రిపోతు

తిరుమల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అలిపిరి కాలినడకమార్గంలో మంగళవారం సుమారు ఆరడుగుల పొడవైన జెర్రిపోతు పాము పట్టుబడింది. దివ్యారామానికి సమీపంలోని నేపాలి సెక్యూరిటీ షెడ్‌లోకి ఈ పాము ప్రవేశించింది. గుర్తించిన సిబ్బంది భయంతో బయటకి పరుగులు తీశారు. వెంటనే పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్ నాయుడికి సమాచారమిచ్చారు. ఆయన అక్కడికి చేరుకుని ఆ పామును చాకచక్యంగా పట్టుకున్నాడు. పట్టుబడిన పామును దట్టమైన అడవిలో విడిచిపెట్టాడు.



పటిష్ఠంగా ఎన్నికల కోడ్ అమలు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 19: జిల్లాలో ఎలక్షన్ షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్ఠంగా అమలు చేస్తున్నామని ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ అన్నారు. అమరావతి నుంచి మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మీనా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో తన క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టరు పాల్గొన్నారు. ఇప్పటికే జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధికి సంబంధించి పీవో, ఏపీవోలకు ఎన్నికల నిర్వహణపై తొలివిడత శిక్షణ ఇచ్చామని చెప్పారు. ప్రభుత్వ, ప్రభుత్వ సంస్థల ప్రాంగణాల్లో, వాణిజ్య స్థలాల్లో ఎటువంటి హోర్డింగులు, బ్యానర్లు, పోస్టర్లు అనుమతించవద్దని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచించారు. సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలకు క్షేత్రస్థాయిలో నియమావళిని పటిష్ఠంగా అమలు చేయాలన్నారు.

పార్టీల కార్యక్రమాల్లో పాల్గొంటే చర్యలు

చిత్తూరు రూరల్: వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఎవరైనా రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో పాల్గొంటే క్రమశిక్షణా చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి హెచ్చరించారు. సోమవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించినంతరం పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బందితో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల కోడ్ దృష్టిలో ఉంచుకొని నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. ఎవరైనా, ఎక్కడైనా రాజకీయ సమావేశాల్లో, నేతలతో ఫొటోల్లో కనిపిస్తే సస్పెండ్ చేస్తామన్నారు. 108, 104, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌పై వాహనాలపై రాజకీయ నాయకుల ఫొటోలు తొలగించాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఐవో రవిరాజు, వైద్యులు జానకీరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్వో అనుమతి తీసుకున్నాకే ఎన్నికల ప్రచారం చేయండి

● టీడీపీ అభ్యర్థికి చెప్పిన అధికారులు

గంగాధరనెల్లూరు, మార్చి 19: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో.. రిటర్నింగ్ అధికారి వద్ద అనుమతి తీసుకున్నాకే గ్రామాల్లో ప్రచారం చేయాలని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్‌కు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిణి పద్మసునంద సూచించారు. గంగాధరనెల్లూరు మండలంలో మంగళవారం స్థానిక నేతలతో కలిసి ఆయన ప్రచారం ప్రారంభించారు. మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో ఆ అధికారిణి వచ్చి అభ్యంతరం చెప్పారు. తామేమి మైకులు ఏర్పాటు చేయలేదని, సభలు, సమావేశాలు నిర్వహించలేదని థామస్ చెప్పగా.. ఇంటింటి ప్రచారానికీ ముందుగా అనుమతి తీసుకోవాలని ఆమె చెప్పారు. దీంతో నేతలు ప్రచారాన్ని ఆపి.. తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ఏఆర్వో రవితో మాట్లాడారు. ఆయన సూచన మేరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయగా.. ప్రచారానికి అనుమతి వచ్చింది. ఈకార్యక్రమంలో నేతలు వెంకటేష్, శ్రీధర్‌యాదవ్, దేవరాజులు, స్వామిదాస్, బాలచంద్రారెడ్డి, దేవసుందరం, కోదండరెడ్డి, మునిరాజులయాదవ్, అంజనేయులుశెట్టి, శివప్రసాద్, క్రిష్ణారెడ్డి, సోమచంద్రారెడ్డి, జ్యోతియాదవ్, సతీష్, సగికుమార్ పాల్గొన్నారు.

కార్వేటినగరం: ఆర్వో నుంచి ముందస్తు అనుమతి తీసుకోకుండా మంగళవారం ఉదయం కార్వేటినగరం మండలం సురేంద్రనగరంలో వైసీపీ అభ్యర్థి కృపాలక్ష్మి ప్రచారం చేపట్టారు. ఈ విషయం తెలిసి పంచాయతీ కార్యదర్శి లక్ష్మీపతి ఆమె ప్రచారాన్ని అడ్డుకున్నారు. ఆ తర్వాత ఆమె కూడా అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నారు.

ఆస్పత్రి ఆవరణలో మద్య సేవనం

విధుల్లో ఉండగా పట్టుబడ్డ రుయా వాటర్ మ్యాన్ ● బార్‌ను తలపించేలా సీఐటీయూ కార్యాలయం



నాలుగు రోజుల కిందట విధుల్లో ఉండగా మరో వ్యక్తితో కలిసి మద్యం తాగుతూ పట్టుబడ్డ ఉద్యోగి - సీఐటీయూ కార్యాలయంలో మద్యం బాటిళ్లు, గ్లాసులు

తిరుపతి సిటీ, మార్చి 19: రుయాస్పత్రి ఆవరణలోని ఓ కార్యాలయం వెనుక గదిలో మరో వ్యక్తితో కలిసి ఓ ఉద్యోగి మద్యం తాగుతూ అధికారులకు పట్టుబడ్డాడు. ఆస్పత్రిలో వాటర్‌మ్యాన్‌గా పనిచేసే సుబ్రహ్మణ్యం ఓపీ కేంద్రం ఎదురుగా ఉన్న సీఐటీయూ కార్యాలయంలో నాలుగు రోజుల కిందట మధ్యాహ్నం మద్యం తాగుతున్నాడన్న సమాచారంతో ఏఆర్ఎంవో హరికృష్ణ అక్కడికెళ్లారు. మరో వ్యక్తితో కలిసి వాటర్ మ్యాన్ సుబ్రహ్మణ్యం మద్యం తాగుతుండటాన్ని గుర్తించారు. బారును తలపించేలా కార్యాలయం వెనుక ఓ గదిని ఏర్పాటు చేసి.. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విధుల్లో ఉండాల్సిన ఉద్యోగి దర్జాగా మద్యం తాగుతూ ఉండటాన్ని ఆయన గమనించి వెంటనే కార్యాలయానికి పిలిపించారు. కానీ తర్వాత ఏం జరిగిందో.. మద్యం తాగుతూ పట్టుబడ్డ ఉద్యోగిని మందలించి పంపేసినట్లు తెలిసింది. ఇదిలా ఉంటే.. వాటర్‌మ్యాన్‌కి అండగా అధికార పార్టీ నేతలు ఉండటంతో ఆయన గతంలోనూ విధుల్లో ఉన్నప్పుడు ఆస్పత్రిలోనే మద్యం తాగేవాడని చెబుతున్నారు. అధికార పార్టీ నేతలతో ఉన్న సంబంధాలకు తలొగ్గి.. అధికారులు సైతం ఆయనపై చర్యలు తీసుకోవడానికి సాహసించడం లేదన్న విమర్శలొస్తున్నాయి.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.78 కోట్లు

తిరుమల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.4.78 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు రూ.4.78 కోట్లు ఆదాయం లభించినట్టు మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 65,051 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 23,107 మంది తలనీలాలు సమర్పించారు.

వివాహితకు చిత్రహింసలు

● భర్తపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు

కుప్పం, మార్చి 19: పిల్లలు పుట్టలేదనే నెపంతో ఒక ప్రబుద్ధుడు తన భార్యను చిత్రహింసలకు గురిచేస్తున్నాడు. అంతే కాదు, ఓ బాలికను రెండో వివాహం కూడా చేసుకున్నాడు. దీనిపై ఆ వివాహిత మంగళవారం కుప్పం అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితురాలి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కుప్పం మండలం వసనాడుకు చెందిన శివశంకర్‌కు, మల్లూరు కృష్ణాపురం గ్రామానికి చెందిన హిమబిందుతో 2016 అక్టోబరు 13వ తేదీన వివాహమైంది. వారికి పిల్లలు కలగలేదు. ఈ నెపంతో భర్త శివశంకర్ తోపాటు ఆయన కుటుంబీకులు హిమబిందును చిత్రహింసలు పెట్టసాగారు. ఆరు నెలలకు ముందు బిహార్‌కు చెందిన ఓ బాలికను శివశంకర్ రెండో వివాహం చేసుకున్నాడు. ఆమెను వారం రోజుల క్రితం ఇంటికి తీసుకొచ్చాడు. రెండో పెళ్లి గురించి ప్రశ్నిస్తే, తనను కొట్టి చిత్రహింసలకు గురి చేస్తున్నాడు. పోలీసు అధికారులు తనకు న్యాయం చేయాలని హిమబిందు కోరారు.


పోలీసు స్టేషన్ ఎదుట పెళ్లి నాటి ఫోటో చూపిస్తున్న హిమబిందు

లక్ష్యం చేరే వరకు విశ్రమించొద్దు

● ఎంబీయూ విద్యార్థులకు మోహన్‌లాల్ పిలుపు
● ప్రధానిగా మళ్లీ మోదీయే రావాలన్న మోహన్‌బాబు


మోహన్‌బాబుతో మోహన్‌లాల్, మంచు విష్ణు

చంద్రగిరి, మార్చి 1 : ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దాన్ని సాధించే వరకు విశ్రమించొద్దని ప్రముఖ సినీనటుడు మోహన్‌లాల్ విద్యార్థులకు పిలుపిచ్చారు.చంద్రగిరి మండలం, ఎ.రంగంపేటలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో విద్యానికేతన్ విద్యాసంస్థల 32వ వార్షికోత్సవం, మోహన్‌బాబు జన్మదిన వేడుకలు మంగళవారం అట్టహాసంగా జరిగాయి.ముఖ్య అతిధులుగా ప్రముఖ సినీనటులు మోహన్‌లాల్, ముకేష్ రిషి హాజరయ్యారు. ఈ సందర్భంగా మోహన్‌లాల్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ విద్యను ప్రసన్నం చేసుకొంటే ప్రపంచంలో ఏదైనా సాధించవచ్చని తెలిపారు.సినిమా రంగంలో కొనసాగుతూనే మోహన్‌బాబు విద్యాసంస్థను స్థాపించి విశ్వవిద్యాలయం స్థాయికి తీసుకురావడం అభినందించదగ్గ విషయమన్నారు. అనంతరం మోహన్‌బాబు మాట్లాడుతూ ప్రధానమంత్రిగా మళ్లీ నరేంద్ర మోదీయే రావాలని ఆకాంక్షించారు. ఏ పార్టీని నమ్మాలో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ప్రాంతీయ పార్టీల గురించి తాను ప్రస్తావించనని ,మళ్ళీ ప్రధానిగా నరేంద్రమోదీ వస్తే దేశం బాగుపడుతుందనేది తన మనసులో మాట అన్నారు. డబ్బులు అందరూ ఇస్తారని, అవి తీసుకుని మనసుకు నచ్చిన వారికే ఓటు వేయాలన్నారు.విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. హీరో విష్ణు కుమార్తె అరియాన ఆలపించిన పాశ్చాత్య సంగీతం ఆకట్టుకుంది.మనోజ్‌కుమార్ తనకు తండ్రితో ఉన్న అనుబంధాన్ని డాక్యుమెంటరీ రూపంలో ప్రదర్శించారు.ఎంబీయూ వీసీ నాగరాజ రామారావు, రిజిస్ట్రార్ డాక్టర్ సారథి, మోహన్‌బాబు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ఆధునికతను సంతరించుకున్న గ్రంథాలయాలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 19: గ్రంథాలయాలు ఆధునికతను సంతరించుకున్నాయని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ వీసీ కృష్ణమూర్తి అన్నారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రకు చెందిన 75 మంది జాతీయ గ్రంథాలయాల నిర్వాహకులకు ఎస్వీయూ సెనేట్ హాల్లో మంగళవారం మొదలైన పునశ్చరణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. ఎన్ఎంఎల్ అదనపు డైరెక్టర్ జనరల్ బీవీ శర్మ మాట్లాడుతూ.. దేశంలోని పబ్లిక్ లైబ్రరీల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని చెప్పారు.

ఉలిక్కిపడ్డ సూళ్లూరుపేట


ప్రమాదం జరిగిన గోదాము

బాణసంచా తయారీ కేంద్రంలో ప్రమాదం | ఆరుగురికి గాయాలు | ముగ్గురి పరిస్థితి విషమం

నిబంధనల ఉల్లంఘనపై లైసెన్సు రద్దుకు సిఫార్సు



ఆస్పత్రిలో క్షతగాత్రులు - కాలిన గాయాలతో రవి →

సూళ్లూరుపేట, మార్చి 19: టపాకాయల తయారీ కేంద్రంలో సంభవించిన పేలుడుతో మంగళవారం మధ్యాహ్నం తిరుపతి జిల్లా సూళ్లూరుపేట ఒక్కసారిగా ఉలిక్కిపడింది. పట్టణ సమీపంలోని వట్రపాలెం దగ్గర్లో జాతీయ రహదారి పక్కనే మదీనా గ్రాండ్ ఫైర్ వర్క్స్ పేరుతో బాణసంచా తయారీ కేంద్రం చాలాకాలంగా నిర్వహిస్తున్నారు. దీని లైసెన్సుదారులు ముతీష్, ఆయన భార్య సాధీనబేగం కాగా ఈ కేంద్రాన్ని ప్రస్తుతం వారి కుమారులిద్దరు నిర్వహిస్తున్నారు.11 గంటల సమయంలో టపాకాయల తయారీ కేంద్రంలో ప్రమాదం చోటు చేసుకోగా ఒక్కసారిగా భారీ శబ్దాలతో పేలుళ్లు సంభవించాయి.దీంతో ఎగిసిన మంటల తాకిడికి బయట ఉన్న టపాకాయల నిల్వలు కూడా పేలిపోయాయి.ఈ పేలుళ్ల ధాటికి గోదాములోనే పనిచేస్తున్న ముగ్గురు కూలీల శరీరం చాలావరకూ కాలిపోయింది. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిలో బీహార్‌కు చెందిన శంకర్ చౌదరి, పింకేష్ జాదవ్, రాజ్‌కుమార్, గండ్ మండేల్, జార్ఖండ్‌కు చెందిన రవిలతో పాటు వట్రపాలేనికే చెందిన కందుకూరి శివకుమార్ వున్నారు.గోడౌన్ నుంచి శబ్దాలు విన్న చుట్టుపక్కల జనం ఏమి జరిగిందో తెలియక టపాసుల గోడౌన్ వైపు పరుగులెత్తారు. పేలుళ్లు, మంటలతో ఉన్న వాతావరణం చూసి అందరూ భయపడిపోయారు. గోడౌన్ నుంచి మంటలతో కూడిన దట్టమైన పొగలు వస్తుండడంతో ఇంకా పేలుడు మందులు ఉన్నాయోమోనన్న అనుమానంతో అక్కడకు చేరుకొన్న జనాలు కొంతసేపు హైవే రోడ్డు పైనే ఉండిపోయారు.ఈలోపు క్షతగాత్రుల్లో ఇద్దరు మంటల్లో నుంచి బయటకు వచ్చి లోపల ఇంకా కూలీలున్నారని చెప్పడంతో కాలిన గాయాలతో ఉన్న నలుగురిని స్థానికులే బయటకు తీసుకొచ్చారు. వారిని ఆటోల్లో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకొన్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలను అదుపుచేశారు. ఆర్డీవో చంద్రముని, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, డీఎస్పీ శ్రీనివాసుల రెడ్డి, సీఐ మధుబాబు, ఎస్ఐ రహీం రెడ్డి అక్కడకు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలు తెలుసుకొన్నారు. బాణసంచా గోదాము వద్ద నిబంధనల మేరకు ఎటువంటి జాగ్రత్త చర్యలు కూడా లేనట్లు గుర్తించారు. పేలుడుకు సంబంధించి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టనున్నట్లు ఆర్డీవో తెలిపారు.తరువాత ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకొని క్షతగాత్రులను పరామర్శించి ప్రమాదం ఎలా జరిగిందో అడిగి తెలుసుకొన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తామన్నారు.తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం చెన్నైకి తరలించారు.పేలుడు సంఘటనపై కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామన్నారు. టపాసుల తయారీ కేంద్రం లైసెన్సు రద్దుకు ఉన్నతాధికారులకు సిపార్సు చేశామని ఆర్డీవో తెలిపారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఆస్పత్రి వద్ద వైద్యులను వివరాలడిగి తెలుసుకొంటున్న ఆర్డీవో, డీఎస్పీ

పలమనేరు

కుప్పం/పుంగనూరు

బాబుకు ఓటేద్దాం.. ప్రగతి సాధిద్దాం



కదిరిఓబనపల్లెలో వృద్ధుడికి కరపత్రం అందిస్తున్న కంచర్ల

శాంతిపురం, మార్చి 19 : నారా చంద్రబాబుకు ఓటేద్దాం.... కుప్పం నియోజకవర్గంలో ప్రగతిని సాధిద్దాం.... అంటూ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ప్రచారంలో హోరెత్తించారు. మంగళవారం మండల పరిధిలోని కడపల్లె గ్రామ పంచాయతీలోని శ్యామ రాజుపురం, తిమ్మరాజుపల్లె, బీఎం గొల్లపల్లె, బీరన కుప్పం, కదిరిఓబనపల్లె, కడపల్లె, కాళీగానూరు, మాదనపల్లె గ్రామాలలో టీడీపీ నేతలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కరపత్రాలను పంచి పెట్టారు. అంతకుముందు బీఎం గొల్లపల్లె గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్క రించి ప్రసంగించారు. అక్కడ కొంత మంది వైసీపీ యువ నాయకులు బీరనకుప్పంకు చెందిన రమేష్, అశోక్, కదిరిఓబనపల్లెకు చెందిన కుంజప్ప, వసరాయ, శివపురానికి చెందిన మునిరత్నం, బాబులతో పాటు మరో 15 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. యూనిట్ ఇన్‌చార్జి పెద్దన్న, పంచాయతీ పార్టీ అధ్యక్షులు టీరేష్ సహకారంతో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథ్‌నాయుడుల సమక్షంలో పసుపు కండువాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్‌బాబు, పీఏ మనోహర్, మాజీ ఎంపీపీ ఉదయ కుమార్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు విజయరామిరెడ్డి, టీడీపీ వడ్డెర సాధికార జిల్లా కన్వీనర్ కోళ్ల వెంకటేష్, క్లస్టర్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పీవీ నాగరాజు, యూనిట్ ఇన్‌చార్జిలు ఆర్ ఎస్ మణి, పెద్దన్న, నారాయణస్వామి, గోపాల్, రుద్రప్ప, భాస్కర్ మాజీ సర్పంచ్ నాగభూష్ణంరెడ్డి, ఏఎంసి నాగరాజు, మాజీ తెలుగు యువత అధ్యక్షుడు కేశవులు, మండల తెలుగు యువత అధ్యక్షుడు సుబ్రమణ్యం, కుప్పం నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు రాజేంద్ర, మండల ఐటీడీపీ అధ్యక్షుడు మంజునాథ్, మాజీ సర్పంచ్ పురుషోత్తం, మండల పార్టీ మహిళ అధ్యక్షురాలు శ్యామల, ప్రధాన కార్యదర్శి రూప తదితరులు పాల్గొన్నారు.

లక్ష మెజారిటీ లక్ష్యం : టీడీపీ



మోడల్ కాలనీలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్ తదితరులు

కుప్పం, మార్చి 19: టీడీపీ అధినేత చంద్రబాబు లక్ష మెజారిటీయే లక్ష్యంగా ముందుకు పోతున్నామని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని మోడల్ కాలనీలో ఆయన మంగళవారం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాలతో కూడిన కరపత్రాలు పంచి పెట్టారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే కుప్పం ఎంతగా అభివృద్ధి చెందుతుందో వివరించారు. వైసీపీ పాలనలో పదేళ్లు వెనక్కు వెళ్లిపోయిందని, మళ్లీ అభివృద్ధి జరగాలంటే చంద్రబాబు వల్లే సాధ్యమని చెప్పారు. అలాగే ముస్లింలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, గోపీనాథ్, సత్యేంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల్లో అప్రమత్తంగా ఉండాలి



సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ మహేశ్వరరెడ్డి

గంగవరం, మార్చి 19: ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో సరిహద్దు చెక్‌పోస్టుల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పలమనేరు డీఎస్పీ మహేశ్వరరెడ్డి సూచించారు. మంగళవారం గంగవరం మండలం జంగాలపల్లె సమీపంలోని కర్ణాటక సరిహద్దులో ఉన్న నంగలి చెక్‌పోస్టును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. కర్ణాటక నుంచి వచ్చే ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీలు చేయాలన్నారు. ముఖ్యంగా మద్యం రవాణా, నగదు, ఓటర్లను ప్రభావితం చేసే వస్తు సామగ్రిపై దృష్టిసారించాలని సూచించారు. అటువంటివి ఉంటే సీజ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గంగవరం సీఐ చిన్నగోవిందు, సిబ్బంది పాల్గొన్నారు.

పుంగనూరు కవులకు ఘన సన్మానం



పుంగనూరు రూరల్, మార్చి19: పుంగనూరుకు చెందిన కవులు, సామాజిక కార్యకర్తలను మడకశిరలో మంగళవారం ఘనంగా సన్మానించారు. సత్యసాయి జిల్లా మడకశిరలోని వెంకటేశ్వర వృద్ధాశ్రమంలో జరిగిన కవి సమ్మేళనం, సామాజిక కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఇందులో పుంగనూరుకు చెందిన సామాజిక కార్యకర్తలు గంపల గంగరాజు, కృష్ణమూర్తి, కవులు హసీనా బేగం, తల్లా శ్రీనివాసులును సేవారత్న పురస్కారంతో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఆధ్వర్యంలో అధ్యక్షుడు డీపీహెచ్‌ఎస్ వ్యవస్థాపకుడు హనుమంతు, ఫరూక్‌లు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి, అనంతపురం జిల్లాల కవులు, రచయితల సంఘం కార్యదర్శి జాబిలి, రంజాన్, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

క్వారీ పేలుళ్లతో ప్రాణాపాయం

ఆర్డీవోకు మట్టిపల్లె వాసుల ఫిర్యాదు



ఆవులనత్తం పరిసరాలలో నిర్వహిస్తున్న క్వారీ

కుప్పం, మార్చి 19: కుప్పం మండలం వేపూరు మిట్టపల్లె పంచాయతీ ఆవుల నత్తం పరిస రాలలో నడుస్తున్న క్వారీవల్ల పశువులతో పాటు మనుషుల ప్రాణాలకు కూడా ప్రమాదం పొంచి ఉందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం వారు ఆర్డీవో శ్రీనివాసులకు ఫిర్యాదు చేశారు. క్వారీలో తరచూ జరుగుతున్న పేలుళ్ల వల్ల పరిసర గ్రామాల ప్రజలు ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని బిక్కుబిక్కు మంటూ బతకాల్సి వస్తోందన్నారు. శబ్ధ కాలుష్యం, దుమ్ముధూళి వల్ల పర్యావరణానికి హాని జరుగుతోందన్నారు. ఇందువల్ల వ్యవసాయం సైతం దెబ్బతినే ప్రమాదం ఉందని విచారం వ్యక్తం చేశారు. విచారణ జరిపి క్వారీవల్ల తమకు ఎదురయ్యే ఇబ్బందులు తొలగించాలని విన్నవించారు.

వైసీపీ అక్రమాలు అరికట్టాలంటే టీడీపీ గెలవాలి



తాండాల్లో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

పుంగనూరు రూరల్, మార్చి19: వైసీపీ అక్రమాలు, అరాచకాలను అరికట్టాలంటే రానున్న ఎన్నికలల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని మండల టీడీపీ అధ్యక్షుడు మాధవరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని తాండాల్లో పర్యటించి టీడీపీ సూపర్‌సిక్స్ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి జరగాలంటే టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డిని గెలిపించాలన్నారు. నాయకులు గంగధార్, ప్రసాద్‌స్వామి, రమణ, వెంకటరమణ, మణి, జనసేన నాయకులు విరూపాక్షి, బాలాజీ నాయక్, హరినాయక్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా మహాగణపతి గ్రామోత్సవం



విశేషాలంకరణలో గణపతి

బైరెడ్డిపల్లె, మార్చి 19: బైరెడ్డిపల్లెలోని ఇందిరమ్మ కాలనీలో నూతనంగా నిర్మించిన మహాగణపతి ఆలయంలో ప్రతిష్ఠించ నున్న గణపతి విగ్రహ ఊరేగింపు మంగళ వారం ఘనంగా జరిగింది. బుధవారం (నేటి నుంచి) ఆలయ కుంభాభిషేక ఉత్సవాలు జరగనుండడంతో ముం దుగా స్వామి వారి విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. పలువురు భక్తులు మంగళహారతులిచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గుంటుపల్లి మృతి పార్టీకి తీరనిలోటు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ఎం తదితరులు

కుప్పం, మార్చి 19: టీడీపీ జాతీయ క్రమశిణ కమిటీ సభ్యులు, రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ గుంటుపల్లి నాగేశ్వరరావు మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం అన్నారు. కుప్పం పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయనకు టీడీపీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ టీడీపీలో క్రియాశీలక నాయకుడు మాత్రమే కాకుండా, పార్టీపట్ల గుంటుపల్లికి గల నిబద్ధత ఇతర నాయకులకు ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, అధికసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

బాటగంగమ్మకు విశేషపూజలు



బైరెడ్డిపల్లె, మార్చి 19 : బైరెడ్డిపల్లెలో వున్న బాటగంగమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయపూజారి జయ చంద్ర అమ్మవారికి అభిషేకంచేసి పూజలు జరిపారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న టీడీపీ నాయకులు

కుప్పం రూరల్, మార్చి 19: మండలంలోని చెక్కునత్తం పంచాయతీలో తెలుగుదేశం పార్టీ అభిమాని ఎల్లప్ప తల్లి పాపమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. తెలుగు యువత నాయకుడు చెక్కునత్తం మణి, మునిరత్నం, దేవరాజ్ తదితరులు మంగళవారం ఆమె మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. టీడీపీ అధినేత చంద్రబాబు తరపున మట్టిఖర్చులకు మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.10 వేలు చెక్కు అందజేశారు.

సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో సర్పదోష పూజలు



సర్పదోష నివారణ పూజల్లో భక్తులు

రామకుప్పం, మార్చి 19: రామకుప్పం పట్టణ శివార్లలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మంగళవారం పూజలు వైభవంగా జరిగాయి. ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, విశేష అలంకరణలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. పలువురు భక్తులు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. ఆలయ పురోహితులు కృష్ణమూర్తి, నాగరాజుశర్మ అర్చక బృందం ఈ పూజలు చేశారు. ప్రతి మంగళవారం సర్పదోష నివారణ పూజలు నిర్వహిస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులు విచ్చేసి పూజలు చేయించుకుని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

పరీక్షా కేంద్రాల వద్ద ప్యాడ్‌ల కోసం తనిఖీ

పలమనేరు, మార్చి19 : పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ ముఖ చిత్రంతో కూడిన ప్యాడ్‌లను విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు తీసుకు వచ్చి పరీక్షలు రాస్తున్నట్లు వచ్చిన అధికారులకు సమా చారం అందింది. దీంతో పలమనేరు ఆర్డీఓ మనోజ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, ఎంఈఓ బాలసుం దరం మంగళ వారం పరీక్షా కేంద్రాల్లో తనిఖీలు చేశారు. ఈ నెల 18 వ తేదీ నియోజక వర్గంలోని పలు పరీక్షా కేంద్రాలలో విద్యార్థులు కొందరు ఎమ్మెల్యే ఫొటో ఉన్న ప్యాడ్‌లు తీసుకొచ్చి పరీక్షలకు హాజరైన విషయం విదితమే.

16 మంది గైర్హాజరు : పలమనేరు మండలంలోను, మున్సిపాలిటీ పరిధిలోని 6 పరీక్షా కేంద్రాల్లో మంగళవారం పదవతరగతి పరీక్షలు 1317 మంది రాయాల్సి వుండగా 1301 మంది రాశారని ఎంఈఓలు లీలారాణి, బాలసుందరం తెలిపారు.

కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సురేష్‌బాబు

కల్లూరు, మార్చి 19: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని ఎంపీడీఓ సురేష్‌బాబు హెచ్చరించారు. పులిచెర్ల మండలంలోని కల్లూరు, దిగువ పోకల వారిపల్లి, మతు కువారిపల్లి సచివాలయాలు, పులిచెర్ల ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని కల విధుల పట్ల అధికారులు, సిబ్బంది ఎప్పటి కప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. సీ-విజిల్ యాప్, కాల్ సెంటర్, ఆర్ఓ నుంచి వచ్చే ఫిర్యాదులను 100 నిమిషాల్లో పరిశీలించి పరిష్కరించే దిశగా అడుగులు వేయాలన్నారు. వలంటీర్లు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, చౌకదుకాణ డీలర్లు, సంఘమిత్రలు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే సంబంధిత వివరాలు తెలియజేయాలని సూచించారు. ఈఓపీఆర్‌డీ యుగందర్, ఏఓ సుగుణమ్మ, డీఈఈ వెంకట్రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

నాసిరకంగా గంగమ్మ ఆలయ నిర్మాణం



కుప్పం, మార్చి 19: అద్భుతంగా ఉన్న రాతి కట్టడాన్ని కూల్చి ప్రసన్న తిరుపతి గంగమ్మ ఆలయాన్ని కేవలం సిమెంటుతో నాసిరకంగా నిర్మిస్తున్నారని అఖిల పక్ష నేతలు విమర్శిం చారు. టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి నరేశ్, ఎమ్మార్పీఎస్ నాయకుడు దేవరాజ్‌లు మంగళవారం ఆలయ నిర్మాణ పనులను పరిశీ లించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1996లో అప్పటి ముఖ్య మంత్రి చంద్రబాబు ప్రసన్న తిరుపతి గంగమ్మ ఆలయాన్ని సుంద రంగా నిర్మించారని చెప్పారు. దాన్ని అనవ సరంగా కూల్చిన వైసీపీ ప్రభుత్వం, రాతితో పునర్నిస్తామని చెప్పి కేవలం సిమెంటుతో నిర్మాణం చేయడం దారుణమన్నారు. త్వరలో జరుగనున్న గంగమ్మ జాతరకు లక్షల మంది భక్తులు అమ్మవారి దర్శనానికి వస్తారన్నారు. జాతరలోగా ఆలయ నిర్మాణం పూర్తిచేస్తామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, ఎంపీ రెడ్డెప్పలు అప్పట్లో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే నిర్మాణం ప్రారంభించి ఏడాది న్నర పూర్తవుతున్నా ఇంకా అరకొర పనుల్లోనే ఉందన్నారు. ఆలయ నిర్మాణంపై వైసీపీ నేతలకు ఎంత చిత్తశుద్ధి ఉందో అసంపూర్తి పనులే తెలియజేస్తున్నాయని భక్తులు పేర్కొంటున్నారు.

రాష్ట్రం బాగుపడాలంటే టీడీపీ ప్రభుత్వం రావాలి

గుడుపల్లె, మార్చి 19: రాష్ట్రం బాగుపడాలంటే టీడీపీ ప్రభుత్వం రావాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం శెట్టిపల్లె పంచాయతీలోని గ్రామాల్లో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ చంద్రబాబు కుప్పం నియోజకవర్గాన్ని 30 సంవత్సరాల్లో చేసి అభివృద్ధిని గుర్తుచేసుకోవాలని తెలియజేశారు. కప్పలనత్తంలో 30 కుటుంబాల వారు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు బాబు నాయుడు, చంద్రశేఖర్, మునిరాజు, బేటప్ప నాయుడు, హేమాంబర్ గౌడు, జనసేన మండలాధ్యక్షులు అమీర్, నారాయణ మూర్తి, ఉదయ్‌కుమార్, వెంకటేశ్, ఎల్లప్ప, సుబ్బు, తిరుపతి, భాను మూర్తి, లక్ష్మీపతి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం.. ముగ్గురి అరెస్టు



స్వాధీనం చేసుకొన్న మద్యంతో డీఎస్పీ, సీఐ, ఎస్ఐ, పోలీసులు

గుడుపల్లె, మార్చి 19: కర్ణాటక నుంచి తమిళనాడుకు గుడుపల్లె మీదుగా అక్రమంగా తరలిస్తున్న రూ.లక్షా 6వేలు విలువైన మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని అరెస్టు చేశారు. గుడుపల్లె పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ శ్రీనాథ్, కుప్పం రూరల్ సీఐ ఈశ్వర్‌రెడ్డి, ఎస్ఐ లక్ష్మీకాంత్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. ఎన్నికల నిఘా విభాగం ఇన్‌చార్జ్ అబ్దుల్ రహీమ్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం రాత్రి కర్ణాటక సరిహద్దులోని బిసానత్తం చెక్ పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేపట్టారు. కర్ణాటక నుంచి వస్తున్న కారులోని వ్యక్తులు కారును వదిలి పారిపోయారు. పోలీసులు కారును పరిశీలించగా అందులో మద్యం బయటపడింది. వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. తమిళనాడుకు రాష్ట్రం తిరుపత్తూరుకు చెందిన కార్తీక్(24), మురళీ(30), వెంకటేశు(34) మంగళవారం ఉదయం కుప్పం రైల్వేస్టేషన్ వద్ద అనుమానాస్పదంగా ఉండడంతో అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అంతరాష్ట్ర మద్యం దొంగలని తేలింది. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు ఛేదనలో చురుగ్గా వ్యవహరించిన హెడ్ కానిస్టేబల్ చక్రపాణి, పోలీసులు రత్నప్ప, నటరాజ్, రామక్రిష్ణ, రామ్‌కుమార్, శ్రీనివాసులను అభినందించి రివార్డులను అందజేశారు.

ఓటు ఎంతో విలువైనది



కందూరులో ఓటు హక్కుపై ర్యాలీ

సోమల, మార్చి 19: ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని ఏపీఎం శివ అన్నారు. మంగళవారం కందూరు పురవీధుల్లో వెలుగు మహిళలు అవగాహన ర్యాలీ జరిపారు. ఈసందర్భంగా బస్టాండ్‌లో మానవహారంగా ఏర్పడి ఓటు హక్కు వినియోగం ప్రజలకు అవగాహన కల్పించారు. మహిళలచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు బాషా మసూద్, కార్యదర్శి జయశంకర్, సీసీలు గంగోజీ, నరసింహులు మహిళా సభ్యులు పాల్గొన్నారు.

హంస వాహనంపై ఊరేగిన శ్రీవారు



పుంగనూరు రూరల్, మార్చి19: పట్టణ నడిబొడ్డున కోనేటి వద్ద కొలువైన కళ్యాణ వెంకటేశ్వరస్వామి హంస వాహనంపై ఊరేగారు. బ్రహ్మోత్సవాలల్లో భాగంగా మంగళవారం ఉదయాన్నే స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రత్యేక పూజలు, అలంకరణ అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం చిన్నశేష వాహనంపై ఆసీనుల్ని చేసి పురవీధుల్లో మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. భక్తులు మంగళహారతులు సమర్పించారు. సాయంత్రం హంస వాహనంపై స్వామివారు భక్తులను కటాక్షించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునీంద్రబాబు, అర్చకులు శ్రీనివాసాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సింహ వాహనంపై వెంకన్న విహారం



సోమల, మార్చి 19: ఆవులపల్లె ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళ వారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవమూర్తులను సింహ వాహనంపై అలంకరించి పురవీధుల్లో ఊరేగిం చారు. ఉదయం ఆలయంలోని మూలవిరాట్‌ను సుంద రంగా అలంకరించి అభిషేక పూజలు జరిపి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ అర్చకులు హోమాది కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం క్షత్రియ సంఘం ఉభయదారులు ఉత్సవమూర్తులను పల్లకిలో అలంకరించి ఊరేగించారు. ఈ కార్యక్రమాలను టీటీడీ అధికారులు పర్యవేక్షించారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



పుంగనూరు రూరల్, మార్చి19: ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటును సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం రవి కోరారు. మంగళవారం స్థానిక స్త్రీశక్తి భవన్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు మహిళా సంఘాల సభ్యులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్‌జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీసీలు నాగరత్న, గంగధర్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డి ప్రచారం

పుంగనూరు/ సదుం మార్చి19: అభివృద్ధిని చూసి వైసీపీని గెలిపించాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కోరారు. మంగళవారం పుంగనూరు మండలంలోని ఏతూరు, పెంచుపల్లె గ్రామాల్లో స్కూటర్, ప్రచార రథంపై ఆయన పర్యటించారు. ముడా ఛైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. ● సదుం మండలంలోని ఊటుపల్లె పంచాయతీ తుమ్మగుంట పల్లెలో వైసీపీ శ్రేణుల బైక్ ర్యాలీలో మంత్రి పాల్గొన్నారు. 79 ఎ.చింతమాకులపల్లె, కంభంవారిపల్లె, చింతపర్తివారి పల్లె, రెడ్డివారిపల్లె పంచాయతీల్లో వైసీపీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సోమశేఖర రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

గంగవరం, మార్చి 19: మండలంలోని పత్తికొండ గ్రామానికి చెందిన బాలిక (17) అదృశ్యమైంది. మంగళవారం ఇంటి వద్ద ఉన్న బాలిక కనిపించలేదని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చిన్నగోవిందు తెలిపారు.

నలగుండ్రాయస్వామికి ప్రత్యేకపూజలు

బైరెడ్డిపల్లె, మార్చి 19 : మండలంలోని కడపనత్తం గ్రామంలో కొలువైన నలగుండ్రాయ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం కలశారాధన హోమం, సూర్యప్రభ, చంద్రప్రభ వాహనో త్సవం ఘనంగా జరిగింది. అలివేలుమంగ, పద్మావతి సమేత నలగుండ్రాయస్వామి ఉత్సవమూర్తులకు అర్చ కులు విశేషాలంకరణ గావించి ప్రత్యేకపూజలు నిర్వహిం చారు. అనంతరం మేళతాళాలమధ్య స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు. పలువురు భక్తులు స్వామి వారిని దర్శించుకుని మంగళహారతులిచ్చారు. ఆలయ ధర్మకర్త మురళి, కమిటీసభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

లింగనిర్ధారణ చట్టరీత్యానేరం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ మనోజ్‌రెడ్డి

పలమనేరు, మార్చి19: లింగనిర్ధారణ చట్టరీత్యా నేరమని పలమనేరు ఆర్డీఓ మనోజ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తన కార్యాలయంలో లింగ వివక్ష నిర్మూలన పథకంపై వైద్యులతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధారణ చేయడం ద్వారా భ్రూణ హత్యలు జరుగుతాయన్నారు. ఎవరైనా స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధారణ చేస్తే శిక్షలు తప్పవన్నారు. ఈ సమావేశంలో అడి షనల్ డీఎంఅండ్ హెచ్ఓ వెంకటప్రసాద్, వైద్యాధికారి మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీకి ఓట్లు..అభివృద్ధికి బాటలు



కడుమానువంకలో ప్రచారపర్వంలో ఆనందరెడ్డి తదితరులు

రామకుప్పం, మార్చి 19: టీడీపీకి ఓట్లు వేస్తే అభివృద్ధికి బాటలు వేసినట్లేనని అందువల్ల ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుకు ఓట్లు వేయాలని ఆ పార్టీ రామకుప్పం మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, సీనియర్ నేత శ్రీనివాసులురెడ్డి, బందార్లపల్లె, విజలాపురం పంచాయతీల అధ్యక్షులు శ్రీనాథరెడ్డి, కుమార్‌లు కోరారు. వారు మంగళవారం ఆయా పంచాయతీల పరిధిలోని కడుమానువంక, కిలాకిపోడు గ్రామాల్లో చంద్రబాబు తరపున ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక అభివృద్ధి స్తంభించిందన్నారు. రాష్ట్రంలో తిరిగి అభివృద్ధి జరగాలంటే అది టీడీపీ ప్రభుత్వం వస్తేనే సాధ్యమవుతుందని తెలిపారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో అభివృద్ధిని పరుగులు తీయించడమేకాకుండా, సూపర్‌సిక్స్ పథకాల ద్వారా అన్ని వర్గాల వారికి ప్రస్తుతం అందుతున్న దాని కంటే ఎక్కువ ఆర్థికసాయం అందిస్తుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో నేతలు లక్ష్మీనారాయణరెడ్డి, రామకృష్ణారెడ్డి, మునెప్ప, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబును సీఎంగా చేయడమే లక్ష్యం: గురజాల


మాట్లాడుతున్న గురజాల జగన్మోహన్

చిత్తూరు సిటీ, మార్చి 19: సైకిల్ గుర్తుకు ఓటు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా పని చేయాలని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ పిలుపునిచ్చారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ముఖ్యనేతలతో మంగళవారం బీవీ రెడ్డి కాలనీలోని జీజేఎం కార్యాలయంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గురజాల మాట్లాడుతూ చిత్తూరు నియోజకవర్గంలో తనను భారీ మెజారిటీతో గెలిపించేందుకు అందరూ కృషిచేయాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, దుర్గా రామకృష్ణ, వెంకటేశ్వర చౌదరి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు జగదీశ్వర్ నాయుడు, ఆ పార్టీ రాష్ట్ర ఎలక్షన్ కమిటీ సభ్యులు చిట్టిబాబు, నేతలు అట్లూరి శ్రీనివాసులు, సుబ్రమణ్యం నాయుడు, దయారాం, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

భారీ మెజారిటీతో గెలిపించండి

తనను భారీ మెజారిటీతో గెలిపిస్తే చిత్తూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని గురజాల జగన్మోహన్ హామీ ఇచ్చారు. మంగళవారం నగరంలోని జానకారపల్లెలో ఇంటింటికి వెళ్ళి టీడీపీ మ్యానిఫెస్టోను వివరించారు. గురజాల మాట్లాడుతూ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినవెంటనే మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తామని చెప్పారు.

బెదిరింపులకు భయపడకండి...

గుడిపాల, మార్చి 19: ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా, బెదిరింపులకు భయపడకుండా ధైర్యంగా పనిచేయాలని గురజాల జగన్మోహన్, మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. గురజాల మాట్లాడుతూ అర్హులైన వారందరినీ ఓటరు జాబితాలో చేర్పించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. టీడీపీకి కంచుకోటగా వున్న గుడిపాలలో ఈసారి అత్యధిక మెజార్టీ వచ్చేవిధంగా చూడాలన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, జనసేన పార్టీ అధ్యక్షుడు రూప్ కుమార్, బీజేపీ జిల్లా నాయకుడు చిట్టిబాబు, టీడీపీ నాయకులు అనిల్‌కుమార్, హరి, నాగరాజ యాదవ్, బలరామ్, విక్టోరియా, కిట్టు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై రెండు గంటల్లో స్పందించాలి: జేసీ

చిత్తూరు రూరల్, మార్చి 19: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు నియమించిన బృందాలు ఫిర్యాదు వచ్చిన రెండు గంటలలోపై స్పందించి సమస్యను పరిష్కరించాలని జేసీ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం సాయంత్రం చిత్తూరు తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ విడుదలైందని, నియోజకవర్గంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలుకు నియమించిన అన్ని బృందాలు అప్రమత్తంగా ఉండాలని, సమస్య ఉందంటే సకాలంలో స్పందించాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ అరుణ, డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ నిత్యాబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పటిష్ఠంగా అమలు చేయాలి

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 19: ఎన్నికల నియమావళిని అందరూ పటిష్ఠంగా అమలుచేయాలని, సమర్థవంతంగా విధులు నిర్వహించాలని చిత్తూరు నియోజకవర్గ ఆర్వో, జేసీ శ్రీనివాసులు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో వార్డు సచివాలయ సిబ్బందితో జరిగిన సమావేశంలో చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్ అరుణతో కలసి జేసీ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రాజకీయ నాయకుల బోర్డులు, ఫ్లెక్సీలు వెంటనే తొలగించాలని, విగ్రహాలన్నింటికీ ముసుగులు వేయాలని, ఏ పార్టీ నేతలతోనూ సంబంధాలు పెట్టుకోరాదని, ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో 26 నుంచి 50వ వార్డు వరకు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అపోలోలో యూఎన్ క్లబ్ ప్రారంభం


కార్యక్రమంలో మాట్లాడుతున్న అపోలో వైస్ చాన్సలర్ వినోద్ భట్

చిత్తూరు రూరల్, మార్చి 19: చిత్తూరు అపోలో నాలెడ్జ్ సిటీలో యునైటెడ్ నేషన్ (యూఎన్) క్లబ్‌ను కళాశాల వైస్ చాన్సలర్ వినోద్ భట్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేటితరం విద్యార్థులు తమలో ఉన్న నైపుణ్యం వల్ల సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సులువుగా సాధించవచ్చునని పేర్కొన్నారు. యూఎన్ క్లబ్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ క్లబ్ ద్వారా ప్రభుత్వ ప్రైవేటు సంస్థలతో కలిసి పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రమ్య, జయంతి తదితరులు పాల్గొన్నారు.

అన్నక్యాంటీన్‌లో అన్నదానం

పూతలపట్టు, మార్చి 19: మండల కేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఉన్న అన్నక్యాంటీన్‌లో మంగళవారం పంటపల్లె పంచాయతీ పరిధిలోని గ్రామస్తులు భోజనం వితరణ చేశారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కలికిరి మురళీమోహన్, మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, ప్రతాపనేని చంద్రమౌళి, పరంధామ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం: ఒకరి అరెస్టు

బంగారుపాళ్యం, మార్చి 19: గంజాయిని విక్రయిస్తున్న ఓ వ్యక్తిని మంగళవారం అరెస్టుచేసినట్లు సీఐ లక్ష్మయ్య తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. బంగారుపాళ్యానికి చెందిన అంజాద్ ఖాన్ (39) బంగారుపాళ్యం దళితవాడలోని వినాయకుడి గుడి ఎదురుగా 2.4 కేజీల గంజాయితో పట్టుబడ్డాడు. అతడి వద్ద గంజాయిని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

రాజన్‌కు బీసీ నేతల సన్మానం



చిత్తూరు సిటీ, మార్చి 19: చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడిగా నియమితులైన సీఆర్ రాజన్‌ను మంగళవారం సాయంత్రం తిరుచానూరులోని ఆయన నివాసంలో బీసీ నేతలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజన్ నివాసం వద్ద బాణసంచా పేల్చి, స్వీట్లు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు నగర బీసీ సెల్ అధ్యక్షుడు శంకర్, 47వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి ఉదయ్ కుమార్, మాజీ కార్పొరేటర్లు మురుగ, ఉదయ్‌కుమార్, దేవరాజ్, నేతలు శివకుమార్, కుమరేష్, వినోద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోనే బీసీలకు పెద్దపీట

పెనుమూరు, మార్చి 19: తెలుగుదేశం పార్టీలోనే బీసీలకు సముచిత స్థానం లభిస్తుందని, బీసీలకు పెద్ద పీట వేసేది చంద్రబాబేనని ఆ పార్టీ మండల ప్రధానకార్యదర్శి భాస్కర్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడిగా వన్నెకుల క్షత్రియకు చెందిన సీఆర్ రాజన్‌ను నియమించినందుకు పలువురు బీసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రాబోవు ఎన్నికల్లో బీసీలందరూ టీడీపీ గెలుపునకు కృషి చేస్తామని ఆయన అన్నారు. బీసీ మండల అధ్యక్షులు అశోక్, శేఖర్, రవి, వాసు, పయణి, చిట్టీ తదితరులు పాల్గొన్నారు.

గుడిపాలలో...

గుడిపాల, మార్చి 19: చిత్తూరు పార్లమెంటరీ అధ్యక్షుడుగా సీఆర్ రాజన్‌ను నియమించడంతో మండల తెలుగు రైతు ఉపాధ్యక్షుడు పళని, బీసీ నాయకులు మోహన్, జయచంద్ర మంగళవారం హర్షం వెలిబుచ్చారు. బీసీలను గుర్తించి, వారికి పదవులు కట్టబెట్టిన వ్యక్తి టీడీపీ అధినేత చంద్రబాబేనని వారు తెలిపారు.

ముమ్మరంగా తనిఖీలు


గొల్లమడుగు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

గుడిపాల, మార్చి 19: మండలంలోని చిత్తూరు-వేలూరు, బెంగళూరు-చెన్నై జాతీయ రహదారి అయిన ఆంధ్ర సరిహద్దులో గొల్లమడుగు, శాంతిపురం వద్ద ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీలను ముమ్మరం చేస్తున్నారు. ఎస్పీ జాషువా ఆదేశాల మేరకు మంగళవారం వెస్ట్ సీఐ రవిశంకర్ ఆధ్వర్యంలో ఎస్ఐ శ్రీనివాసరావు తన సిబ్బందితో చిత్తూరు-వేలూరు రహదారిలో వెళ్లే వాహనాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి గణపతి, పోలీసులు పాల్గొన్నారు.

ఘనంగా మాస మహిళా దినోత్సవం

చిత్తూరు కల్చరల్, మార్చి 19: స్థానిక ప్రభుత్వాస్పత్రిలోని ప్రసూతి వార్డులో మంగళవారం సత్యసాయి సేవా సమితి మహిళా సభ్యులతో మాస మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆస్పత్రి ప్రాంగణంలోని వినాయక ఆలయంలో సభ్యులు ప్రత్యేక ప్రార్థనలు చేసి ధన్వంతరి స్తోత్రం సామూహికంగా పఠించారు. అనంతరం ఆస్పత్రిలోని ప్రసూతి వార్డులోని గర్భిణులకు, బాలింతలకు, చిన్నపిల్లల వార్డులోని చిన్నారులకు పండ్లు పాలు, బ్రెడ్లు, దుస్తులు, స్వామివారి ప్రసాదాలు అందజేశారు. సత్యసాయి సేవాసమితి నగర కన్వీనర్ శేషనారాయణ, గజేంద్రరెడ్డి, దేవరాజు, బద్రి, రుక్మిణి, విద్య తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఓటుపై చైతన్యం

చిత్తూరు (సెంట్రల్), మార్చి 19: డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక టీటీడీసీ కార్యాలయంలో పీడీ తులసి దివ్యాంగులకు ఓటు హక్కుపై చైతన్యం కల్పించారు. పీడీ మాట్లాడుతూ దివ్యాంగులు, 85 సంవత్సరాలు పైబడిన వృద్ధుల కోసం నిర్దేశించిన ఫారం బి12పై అవగాహన కల్పించారు. నమోదు కాబడిన దివ్యాంగులకు పోలింగ్ రోజున ఎలాంటి ఇబ్బంది లేకుండా ఓటు హక్కు వినియోగించుకునేందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆమె తెలిపారు. డీఆర్‌డీఏ సిబ్బంది, ఏపీడబ్ల్యూడీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మురళి, జిల్లా అధ్యక్షుడు గుర్రప్ప, దివ్యాంగులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

గంగాధరనెల్లూరు, మార్చి 19: ఓటు హక్కు వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో వినతశ్రీ, ఐకేపీ ఏపీఎం చిరంజీవి కోరారు. గంగాధరనెల్లూరు ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన సమావేశం నిర్వహించారు. సూపర్‌వైజర్ బిందుమాలతి, ఐకేపీ, ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేలంలో రూ.5.05 లక్షల ఆదాయం

బంగారుపాళ్యం, మార్చి 19: మండలంలోని తగ్గువారిపల్లె పంచాయతీ దినసరి, వారపు సంతకు మంగళవారం ఆ గ్రామ సచివాలయంలో వేలం నిర్వహించారు. ఈ వేలం ద్వారా రూ.5.05 లక్షలు పంచాయతీకి ఆదాయం వచ్చినట్లు పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ తెలిపారు. బంగారుపాళ్యానికి చెందిన హరి వేలం పాటను దక్కించుకున్నారు. సర్పంచ్ వాణిప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

చిత్తూరు, మార్చి 19: చిత్తూరు గిరింపేటలో ఉన్న నిరాశ్రయుల వసతి గృహంలో ఆర్‌వీఎస్ ఆస్పత్రి డాక్టర్లచే మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వసతి గృహంలో ఉన్న నిరాశ్రయులకు డాక్టర్లు ఖలీల్, నగ్మా తదితరులు హాజరై వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. వసతి గృహ నిర్వాహకుడు జోసఫ్‌రాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో కరుణాకరన్

చిత్తూరు కల్చరల్, మార్చి 19: స్థానిక గుర్రప్పనాయుడు వీధిలోని అంకాల పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మంగళవారం సంతపేట నాగాలమ్మ ఆలయ ధర్మకర్త, మాతృసేవాసంస్థ వ్యవస్థాపకులు కరుణాకరన్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

'ఆయుష్' పోయింది..!

- ఈ నిర్లక్ష్యానికి బాధ్యులెవరో?


పచ్చికాపల్లం యునాని వైద్యశాల ఇదే

వెదురుకుప్పం, మార్చి 19: వైద్య సేవలు అందించాలని ఏర్పాటు చేశారు. ఆశయం బాగానే ఉన్నా ఆచరణలో అధికారుల నిర్లక్ష్యం, ఉదాసీనత వల్ల 'ఆయుష్' పోయిందని చెప్పవచ్చు. వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న ఏపీ ప్రభుత్వ ఆయుష్ విభాగానికి చెందిన ప్రభుత్వ యునాని వైద్యశాలను చూస్తే యంత్రాంగం నిర్లక్ష్యం మాత్రం కళ్లకు కట్టినట్లు కనిపిస్తోంది. ఆ ఆస్పత్రి తెరవరనడానికి అక్కడి భవనం శిథిలస్థితే నిదర్శనం. కనీసం సామగ్రిని భద్రపరిచే దిక్కు లేదు. ఆ ఆస్పత్రి పనిచేస్తుందో లేదో చెప్పే వారే లేరు. పీహెచ్‌సీ వారు మాత్రం తమకు, ఆ ఆయుష్‌కి సంబంధం లేదని చెబుతున్నారు. ఆయుష్ భవనానికి ఏర్పాటు చేసిన తలుపు పూర్తిగా చెదలు తిని నాశనమైంది. తాళం మాత్రం భవనం తలుపుకు సాక్ష్యంగా వెక్కిరిస్తూ నిలబడింది. ఆ భవనంలోని సామగ్రి సైతం దారుణస్థితిలో ఉంది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సైతం తమ పరిధిలోకి యునాని వైద్యశాలలు రావని, దానిని ప్రత్యేకంగా కడప నుంచి పర్యవేక్షిస్తారని చెబుతున్నారు. ఈ నిర్లక్ష్యానికి బాధ్యులెవరో?

గోసంరక్షణ ట్రస్టుకు రూ.2లక్షల విరాళం



ఐరాల(కాణిపాకం), మార్చి 19: స్వయంభు కాణిపాక వరసిద్ధుడి ఆలయం వద్ద నిర్వహిసుస్తున్న గోసంరక్షణ ట్రస్టుకు బెంగళూరుకు చెందిన దాతలు చేతన్‌కుమార్‌రెడ్డి రూ.1,00,000, రమణారెడ్డి రూ.1,00,000 మంగళవారం చెక్కు రూపంలో విరాళంగా అందించారు. దాతలకు ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం వారికి వేదాశీర్వాదం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సర్వేలన్నీ టీడీపీకే అనుకూలం

- బెంబేలెత్తుతున్న వైసీపీ: థామస్


వలస నెల్లేపల్లెలో వైసీపీకి చెందిన భాస్కర్‌రెడ్డికి టీడీపీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న థామస్

గంగాధరనెల్లూరు, మార్చి 19: రాష్ట్రంలో జరగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఈసారి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి వల్ల సర్వేలన్నీ టీడీపీకే అనుకూలంగా వస్తున్నందున వైసీపీ పెద్దలు బెంబేలెత్తుతున్నారని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి డాక్టర్ థామస్, జనసేన కన్వీనర్ పొన్న యుగంధర్‌లు అన్నారు. మండలంలోని వింజం పంచాయతీ వలసనెల్లేపల్లెలో వైసీపీకి చెందిన బెంగళూరు భాస్కర్‌రెడ్డి, బాబురెడ్డి, హరీష్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, కిరణ్‌రెడ్డి, సోమశేఖర్ రెడ్డి, పాచిగుంట పంచాయతీ బాలాపురానికి చెందిన రమేష్‌లకు థామస్ టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని ప్రముఖ సర్వేసంస్థలన్నీ కూడా టీడీపీ కూటమి అధికారంలోకి రానున్నట్లు తేల్చాయన్నారు. దీన్ని బట్టే రాష్ట్రంలో వివిధ వర్గాల ప్రజలకు సీఎం జగన్‌పై ఏ స్థాయిలో వ్యతిరేకత ఉందో ఇట్టే అర్థమవుతుందని చెప్పారు. ఈ ఎన్నికల్లో వైసీపీ పూర్తిగా తుడిచిపెట్టుకుని పోవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు బాలచంద్రారెడ్డి, దేవరాజులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ యువరాజారెడ్డి, క్రిష్ణారెడ్డి, మురళీరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, నారాయణరెడ్డి, నాగరాజారెడ్డి, జ్యోతిరెడ్డి, సతీష్‌కుమార్, సగికుమార్, సోమచంద్రారెడ్డి, గిరిధర్‌రెడ్డి, తులసిరెడ్డి, ఉలగనాధం పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేతకు పలువురి నివాళి

మండలంలోని నెల్లేపల్లె పంచాయతీ చిన్నమిట్టపల్లె గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత రవీంద్రారెడ్డి(54) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం రాత్రి మరణించారు. ఈవిషయం తెలుసుకుని చిన్నమిట్టపల్లెలో రవీంద్రారెడ్డి భౌతికకాయానికి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి డాక్టర్ థామస్, జనసేన కన్వీనర్ పొన్న యుగంధర్, జిల్లా టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, నేతలు జ్యోతిరెడ్డి, దేవరాజులు నాయుడు, వెంకటేష్‌యాదవ్, వెంకటపతిరెడ్డి, నెల్లేపల్లె సుబ్రమణ్యం, తుకారామ్‌రెడ్డి, అఖిల్ మంగళవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించి, వారి కుటుంబసభ్యులను పరామర్శించారు.

మెటీరియల్ డ్రా చేస్తారు... పనులు చేయరు

- వర్క్‌ఆర్డర్లు క్లోజ్ చేయకుంటే ఏఈ, డీఈల జీతాల నుంచి రికవరీ: ట్రాన్స్‌కో ఎస్ఈ


అధికారులతో మాట్లాడుతున్న ఎస్ఈ కృష్ణారెడ్డి

చిత్తూరు రూరల్, మార్చి 19: వర్క్‌ఆర్డరుకు సంబంధించిన మెటీరియల్‌ను స్టోర్ నుంచి డ్రా చేస్తారు కానీ పనులు మాత్రం చేయరని విద్యుత్ శాఖ చిత్తూరు రూరల్ డివిజన్ ఏఈలు, డీఈల తీరుపై ట్రాన్స్‌కో ఎస్ఈ కృష్ణారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం జిల్లా పర్యటనలో భాగంగా చిత్తూరు రూరల్ డివిజన్ ఈఈ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ డివిజన్ పరిధిలో 2019-20 సంవత్సరానికి సంబంధించిన వర్క్ ఆర్డర్లు పెండింగ్‌లో ఉన్నాయని ఆయన గుర్తించారు. అనంతరం స్టోర్‌ని తనిఖీ చేసిన ఆయనకు విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. వర్క్ ఆర్డర్లకు సంబంధించిన మెటీరియల్ స్టోర్ నుంచి తీసుకెళ్లినట్లు రికార్డుల్లో నమోదు చేసి ఉండటాన్ని ఆయన గుర్తించారు. అయితే క్షేత్రస్థాయిలో పనులు జరగలేదని, ఏళ్ల తరబడి ఆయా పనులు పెండింగ్‌లో ఉన్నట్లు ఆయన తనిఖీలో బయటపడ్డాయి. దీనిపై ఏఈలు, డీఈలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రా చేసిన మెటీరియల్‌ను ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఈ నెలాఖరు లోపు పనులు పూర్తి చేయకుంటే ఏఈలు, డీఈల జీతాల నుంచి రికవరీ చేస్తామని హెచ్చరించారు. అలాగే మేలో జరుగనున్న ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని పోలింగ్ కేంద్రాలకు విద్యుత్ సక్రమంగా అందుతుందా లేదా అని సరిచూసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలను ఏఈలు పరిశీలించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఈఈ హరి, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ఏపీని అధఃపాతాళానికి నెట్టిన జగన్: భానుప్రకాష్


ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న గాలి భానుప్రకాష్

నగరి, మార్చి 19: విభజన అనంతరం అభివృద్ధిలో అగ్రస్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని జగన్ ముఖ్యమంత్రి అయ్యాక అధఃపాతాళంలోకి నెట్టేశారని నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ విమర్శించారు. నగరి బ్రాహ్మణవీధిలోని బీజేపీ కార్యాలయంలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఆత్మీయ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న భానుప్రకాష్ మాట్లాడుతూ బీజేపీ, జనసేన, టీడీపీ కలయికతో జగన్‌మోహన్‌రెడ్డికి వణుకు పుట్టుకొచ్చిందని ఎద్దేవా చేశారు. నగరి నియోజకవర్గాన్ని రోజా ఏ మాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. జరిగిన నష్టాన్ని పూడ్చాలంటే 2024 ఎన్నికల్లో వైసీపీకి తగిన బుద్ధి చెప్పి రాష్ట్రంలో టీడీపీ, కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావాలన్నారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. టీడీపీ నేత ప్రసాదరావు మాట్లాడుతూ స్థానిక సమస్యల పరిష్కారంలో వైసీపీ విఫలమైందని, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని విమర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిలకం ఈశ్వర్‌ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ, జనసేన, టీడీపీ కూటమి అత్యధిక స్థానాలలో గెలిచి ఇటు రాష్ట్రం, అటు దేశం అభివృద్ధి పథంలో అడుగిడేలా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమేష్‌బాబు, శివకుమార్, గుణశేఖర్, టీఎన్‌టీయూసీ బాలాజీ, రాష్ట్ర మహిళా అధికారప్రతినిధి మీరా, రుక్కుం బాలాజీ, సురేష్, బీజేపీ నాయకులు రమేష్ నాయుడు, మోహన్, రామ్మూర్తి యాదవ్, భువనేశ్వరి, బాలకృష్ణ, జనసేన నాయకులు మెరుపుల మహేష్, దేవా తదితరులు పాల్గొన్నారు

టీడీపీ నేతపై దాడి ఘటనలో

పుత్తూరు మున్సిపల్ చైర్మన్‌పై కేసు నమోదు

- బాధితుడిపైనా అట్రాసిటీ కేసు

పుత్తూరు అర్బన్, మార్చి 19: టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు షణ్ముగరెడ్డిపై జరిగిన దాడి సంఘటనలో పుత్తూరు మున్సిపల్ చైర్మన్ ఆనంగి హరి, ఆయన అనుచరుడు సునీల్‌పై సోమవారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే మున్సిపల్ చైర్మన్ హరి అనుచరుడు సునీల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాధితుడు షణ్ముగరెడ్డి, నవీన్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేశారు. పుత్తూరు పట్టణంలోని చింతలగుంట వద్ద సోమవారం సాయంత్రం జరిగిన సంఘటనకు సంబంధించిన ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు.

ఇలాగైతే జీరో వయెలెన్స్ ఎన్నికలు సాధ్యమేనా?

పట్టణంలో సోమవారం సాయంత్రం నుంచి జరిగిన పరిణామాల పట్ల పట్టణవాసుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇరుపార్టీల నాయకులు ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేసుకునే క్రమంలో పోలీస్‌స్టేషన్ వద్ద తలెత్తిన ఉద్రిక్త పరిస్థితులు, వాగ్వాదాలతో సమీప ప్రాంతం దద్ధరిల్లింది. ఇరువర్గాలను చెదరగొట్టే ప్రయత్నంలో భాగంగా పోలీసులు లాఠీలకు పనిచెప్పారు. ఈ క్రమంలో స్టేషన్‌కు ఆనుకుని ఉన్న మార్కెట్ వద్ద కొనుగోళ్ల కోసం వచ్చిన సామాన్యులకు కూడా లాఠీ దెబ్బలు తగలడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒకవైపు పోలీసు అధికారులు స్టేషన్‌లో ఇరువర్గాల నుంచి ఫిర్యాదులు తీసుకుని విచారిస్తుండగా బయట ఉన్న సిబ్బంది యధాలాపంగా విధులు నిర్వహించడంతోనే పరిస్థితి ఉద్రిక్తంగా మారేందుకు ఆస్కారం ఏర్పడిందనే మాటలు వినబడుతున్నాయి. ఒకవైపు కేంద్ర ఎన్నికల కమిషన్ జీరో వయెలెన్స్ పేరుతో ఎన్నికల నిర్వహణకు కసరత్తు చేస్తుండగా రాజకీయ నాయకుల స్వార్థ రాజకీయ ప్రయోజనాల నడుమ పుత్తూరు ప్రశాంతతకు విఘాతం తలెత్తుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

విద్యుత్ లైన్‌కు మరమ్మతులు

విజయపురం, మార్చి 19: మండలంలోని కోసలనగరం నుంచి మిట్టూరు వెళ్లే మార్గమధ్యంలోని మామిడి తోటలో చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని పత్రికల్లో వార్త ప్రచురితం కావడంతో ట్రాన్స్‌కో ఏఈ చంద్రబాబు స్పందించి మంగళవారం మరమ్మతు పనులు చేయించారు. విద్యుత్ తీగలు ఎత్తుగా వెళ్లేలా చర్యలు తీసుకోవడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు.

వెంగళరాజుకుప్పంలో కేంద్ర బలగాల కవాతు



పాలసముద్రం, మార్చి 19: మండలంలోని వెంగళరాజుకుప్పం, నరసింహాపురం, పాలసముద్రం, బలిజకండ్రిగ గ్రామాల్లో కేంద్ర బలగాలు మంగళవారం కవాతు నిర్వహించాయి. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన నేపథ్యంలో ట్రైనీ డీఎస్పీ పవన్‌కుమార్, పాలసముద్రం ఎస్ఐ భారతి ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు ఈ కవాతు నిర్వహించాయి. ఎన్నికల నేపథ్యంలో భద్రత కల్పిస్తామని, ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. నాయకులు, కార్యకర్తలు, ఓటర్లను బెదిరిస్తే పోలీసులకు ఫిర్యాదుచేయాలన్నారు. ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

వైభవంగా అధికార నంది, వృషభ వాహన సేవలు



చిత్తూరు కల్చరల్, మార్చి 19: నగరంలోని కామాక్షి అంబికా సమేత అగస్త్యీశ్వరాలయంలో పంగుణి మాస బ్రహ్మోత్సవాలను గత ఆరు రోజులుగా అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం ఈవో తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు శివాచార్యులు స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు దర్శనం చేసుకొని మొక్కులు తీర్చుకున్నారు. చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సి. కె. జయచంద్రారెడ్డి, చిత్తూరు టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్ పాల్గొని పూజలు చేశారు. అనంతరం స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించిన నంది వాహనంపై అధిష్ఠింపజేసి పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ నిర్వాహకులు శివప్రసాద్, మల్లి ఆచారి, కాళభైరవ ట్రస్టు వ్యవస్థాపకులు టి. వెంకటేషన్, చాణక్య రవి, బీజేపీ నాయకులు పోతుల రామ్మూర్తి, విజయలక్ష్మి బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి. కె. బాబు, గురజాల జగన్మోహన్‌లను చిత్తూరు పూల వర్తకుల సంఘం అధ్యక్షుడు మోహన్ బృందం గజమాలలతో సత్కరించి తమ మద్దతు తెలిపారు. ఉత్సవాల్లో సాయంత్రం చిత్తూరు మొదిలియార్ సంఘం ఉభయంతో స్వామివారికి వృషభ వాహన సేవను వైభవంగా నిర్వహించారు.

లాభాల బాటలో చిత్తూరు కో-ఆపరేటివ్ టౌన్‌బ్యాంక్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 19: నష్టాల దిశలో కొనసాగిన చిత్తూరు కో-ఆపరేటివ్ టౌన్‌బ్యాంకు పాలకవర్గం, సిబ్బంది సహకారంతో గత నాలుగేళ్లగా లాభాల బాటలోకి తెచ్చామని బ్యాంకు సీఈవో దొరైస్వామి శ్రీనివాసన్ తెలిపారు. మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ 2020-21లో రూ.1.58 కోట్లు, 2021-22లో రూ.కోటి లాభాలు గడించిన బ్యాంకు, 2022-23లో రూ.1.98 కోట్లు, 2023-24లో రూ.కోటి లాభాలు ఆర్జించిందన్నారు. బ్యాంకు 117వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సీసీటీబీ 456 డిపాజిట్ స్కీమ్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. ఈ స్కీములో డిపాజిట్ చేసేవారికి 456 రోజులకు ఇతరులకు 7.7శాతం, సీనియర్ సిటిజన్లకు 8.2 శాతం మేర అన్ని బ్యాంకులకంటే అత్యధిక వడ్డీ చెల్లిస్తామని చెప్పారు. చిత్తూరు హెడ్ ఆఫీసు, గిరింపేట, దర్గా బ్రాంచ్‌ల్లో కొత్త డిపాజిట్ స్కీమ్ అమలుచేస్తున్నట్లు వివరించారు. ప్రతి డిపాజిట్‌పై రూ.5 లక్షల వరకు ఇన్సూరెన్స్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మార్చి 24వ తేది ఉదయం 10 గంటలకు బ్యాంకు మహాజనసభ గిరింపేట బ్రాంచ్‌లో చైర్మన్ బి.రామ్‌గణేశ్ అధ్యక్షతన జరుగుతుందని వివరించారు.

వేడుకగా చిత్రా పౌర్ణమి బ్రహ్మోత్సవాలు


అధికార నంది వాహనంపై కరకంఠేశ్వరుడు

నగరి, మార్చి 19: నగరి పట్టణ పరిధిలోని కామాక్షి సమేత కరకంఠేశ్వస్వామి ఆలయంలో పంగుణోత్తర బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం కరకంఠేశ్వరస్వామిని అధికార నంది వాహనంపై ఊరేగించారు. ఆలయంలో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మాడవీధుల్లో ఊరేగింపుగా వచ్చిన స్వామిని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ధర్మకర్త సుబ్రమణ్యం ఏర్పాట్లను పర్యవేక్షించారు.